ప్రజాశక్తి

గురువారం 24 నవంబరు 2022



ఉత్తరాంధ్ర రచయితల మహాసభలకు ఆహ్వానం

శ్రీకాకుళం: తెలుగు కవులు, రచయితలు, భాషాభిమానుల కోసం డిసెంబరు 17, 18 తేదీల్లో పలాస–కాశీబుగ్గలో ఉత్తరాంధ్ర స్థాయి రచయితల మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.రుద్రమూర్తి, సిక్కోలు జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో ఉత్తరాంధ్రకు సంబంధించిన కళలు, సాహిత్యం, భాషా సంస్కృతులు, సామాజిక అంశాలపై సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రముఖ సాహిత్యకారులు కె.శివారెడ్డి, జయధీర్ తిరుమలరావు, తనికెళ్ల భరణి, అప్పలనాయుడు పాల్గొంటారని పేర్కొన్నారు. సభల్లో ప్రతినిధులు పాల్గొనే వారికి రెండు రోజులూ అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రతినిధులకు మాత్రమే కవి సమ్మేళనంలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 30వ తేదీలోగా ప్రతినిధి రుసుముగా రూ.300 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9440334110, 8978158958 సంప్రదించాలని కోరారు.

మహాయజ్ఞంలా భూ సర్వే



- ప్రతి కమతానికీ యునిక్ ఐడి నంబరు
- కిడ్నీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం అడుగులు
- రూ.765 కోట్లతో రక్షిత మంచినీరు
- రూ.50 కోట్లతో రీసెర్చ్ ఆస్పత్రి
- ఐదేళ్ల పాలనలో చంద్రబాబు ఏం చేశారు?
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి
- నరసన్నపేటపై వరాల జల్లు

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి, జలుమూరు, నరసన్నపేట

భూ సర్వే చేయడం, భూరికార్డులన్నింటినీ ప్రక్షాళన చేయడం వంటి కార్యక్రమాలన్నీ మహాయజ్ఞంలా చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష (రీ సర్వే) పత్రాల పంపిణీ, పథకం రెండో దశను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో అత్యాధునిక సాంకేతికతో భూముల సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది డిసెంబరుకు సర్వే ప్రక్రియను పూర్తి చేసి, ప్రతి కమతానికి యునిక్ ఐడెంటిఫికేషన్ నంబరు ఇస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఇచ్ఛాపురం, పలాస ప్రాంతంలో కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని సిఎం చెప్పారు. కిడ్నీ సమస్యలతో బాధపడే ప్రజలు మన కళ్లెదుటే దశాబ్దాలుగా కనిపించేవారని, అప్పటి పాలకులు, వారితోపాటు దత్తపుత్రుని వేషంలో సినిమా యాక్టరు వచ్చే వారని చెప్పారు. ఐదేళ్ల పాటు పాలన చేసిన చంద్రబాబు, దత్తపుత్రునికి ఈ ప్రాంతంలో కిడ్నీ రోగులు గుర్తుకు రాలేదని విమర్శించారు. కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న ఆలోచనా వారికి రాలేదన్నారు. ఈ రెండు నియోజకవర్గాలకు సంబంధించి రూ.765 కోట్లతో సర్ఫేస్ వాటర్ తీసుకొచ్చి, కిడ్నీ సమస్యలకు పూర్తి పరిష్కారం చూపించే కార్యక్రమానికి అడుగులు పడుతున్నాయని చెప్పారు. 70 శాతం వరకు పనులు పూర్తయ్యాయని తెలిపారు. పలాసలో రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిని నిర్మిస్తున్నామని, అదీ 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయని చెప్పారు. కిడ్నీ రోగుల కోసం మానవతా దృక్పథంతో ఆలోచన చేసి రూ.10వేలు డయాలసిస్ చికిత్స కోసం వాళ్లకు పెన్షన్ రూపంలో ఇచ్చే మార్పు తీసుకొచ్చామన్నారు.



భూ హక్కు పత్రాలను అందజేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

జిల్లాకు టిడిపి చేసింది శూన్యం : మంత్రి ధర్మాన

వంశధార ప్రాజెక్టు రెండో దశకు జాప్యమవుతున్న నేపథ్యంలో గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేస్తే రిజర్వాయర్ నిండుతుందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి రూ.180 కోట్లు కేటాయించారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. తన ఇన్నేళ్ల రాజకీయ అనుభవంలో టిడిపి ప్రభుత్వం జిల్లాకు ఏం చేయలేదని విమర్శించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం 23 సంస్థలను కేటాయిస్తే, వెనుకబడిన జిల్లాకు కనీసం నాలుగు సంస్థలు రావాల్సి ఉన్నా చంద్రబాబు ఒక్కటైనా ఏర్పాటు చేయలేదన్నారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు అప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

పకడ్బందీగా రీ సర్వే : కలెక్టర్

జిల్లాలో 350 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. క్షేత్రస్థాయి సిబ్బంది సాయంతో ఇతర రాష్ట్రాలు చేయలేని పనిని మనం చేయగలిగామని చెప్పారు. జిల్లాలో ఫిబ్రవరిలో చేపట్టనున్న రెండో దశను మరింత పకడ్బందీగా చేపడతామన్నారు.

రీ సర్వేతో రైతులకు మేలు : ధర్మాన కృష్ణదాస్

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ కొనియాడారు. వందేళ్ల తర్వాత చేపడుతున్న రీ సర్వేతో భూ వివాదాలు పరిష్కారమై రైతులకు మేలు చేకూరుతుందని చెప్పారు.

సర్వే, రిజిస్ట్రేషన్ శాఖ స్టాల్స్ సందర్శన

సభా ప్రాంగణంలో రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలు సమగ్ర భూ సర్వేపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సిఎం జగన్ సందర్శించారు. సర్వే పరికరాలు, రెవెన్యూ గ్రామాల మ్యాపులు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్టాల్స్‌ను సందర్శించి సచివాలయాల్లో చేపడుతున్న రిజిస్ట్రేషన్ల వివరాలను తెలుసుకున్నారు. ప్రజల ముంగిట రిజిస్ట్రేషన్ సేవలు, దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేయడం వల్ల కలిగే లాభాల పోస్టర్లను ఆవిష్కరించారు. సర్వే ఆఫ్ ఇండియా సంచాలకులు సింగ్, సిసిఎల్ఎ సాయిప్రసాద్, అదనపు సిసిఎల్ఎ ఇంతియాజ్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ వి.రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి, రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి విజయలక్ష్మి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల శాఖ ఆర్‌డి కెజియా తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన సాగిందిలా...

- 10.32 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకున్న సిఎం
- 10.58 గంటలకు సభా ప్రాంగణం
- 11 గంటలకు స్టాల్స్ సందర్శన
- 11.16 గంటలకు వేదికపైకి వచ్చిన ముఖ్యమంత్రి
- 12.07 గంటల నుంచి 12.48 వరకు ప్రసంగం
- 12.53 గంటలకు రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ
- 1.05 గంటలకు హెలీప్యాడ్‌కు బయలుదేరిన సిఎం

సిఎంకు ఘన స్వాగతం

జిల్లా పర్యటనలో భాగంగా నరసన్నపేటకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌కు జమ్ము కూడలిలో హెలీప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశు సంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కళ్యాణి, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు కంబాల జోగులు, గొర్లె కిరణ్ కుమార్, రెడ్డి శాంతి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తదితరులున్నారు.



సభకు హాజరైన ప్రజలు

నరసన్నపేటకు వరాల జల్లు

బహిరంగ సభలో ధర్మాన కృష్ణదాస్ తెలుగు మాట్లాడుతూ నరసన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన పనులు, వాటికి నిధుల మంజూరు విషయంపై సిఎంను అభ్యర్థించారు. వీటిపై సిఎం తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ పలు పనులకు విస్తృతంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నరసన్నపేట పట్టణ పరిధిలో ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ సెంటర్ లైటింగ్ ఏర్పాటు కోసం రూ.10 కోట్లు మంజూరు చేశారు. నాలుగు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే విధంగా మడపాం ఎత్తిపోతల పథకానికి రూ.15 కోట్లు మంజూరు చేశారు. సారవకోట మండలం బొంతు ఎత్తిపోతల పథకం మిగిలిన పనులను పూర్తి చేయడానికి రూ.40 కోట్లు ప్రకటించారు. నరసన్నపేట పట్టణంలోని రాజులచెరువు అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేశారు. గుప్పిడిపేట వద్ద సముద్రపు నీరు గ్రామాల్లోకి, పంట పొలాల్లోకి చేరకుండా ఆటోమేటిక్ ఫాలింగ్ షట్టర్ల ఏర్పాటుకు రూ.కోటి ప్రకటించారు. డి.ఎల్ పురం వద్ద వంశధార కాలువపై లో లెవెల్ కాజ్‌వే నిర్మాణం కోసం రూ.కోటి రూపాయలు మంజూరు చేస్తామని హామీనిచ్చారు.



చిన్నారి వైద్యానికి స్పందించిన సిఎం

జి.సిగడాం మండలం చిన్నశిర్లాంకు చెందిన మీసాల కృష్ణవేణి, అప్పలనాయుడు తమ పదేళ్ల కుమార్తె ఇంద్రజతో కలిసి సభా ప్రాంగణానికి వచ్చారు. కాన్వాయ్‌లో వెళ్తున్న సిఎం గమనించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారికి అవసరమైన శస్త్రచికిత్సకు ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుందని భరోసానిచ్చారు. చిన్నారికి తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను ఆదేశించారు. సిఎం ఆదేశాలతో చిన్నారి తల్లిదండ్రులతో కలెక్టర్ చర్చించి, డిఎంహెచ్ఒ పర్యవేక్షణలో జెమ్స్ ఆస్పత్రికి తరలించారు.



జమ్ము కూడలి వద్ద నిలిచిన ట్రాఫిక్

జనం అగచాట్లు

సిఎం పర్యటన సందర్భంగా నరసన్నపేటలో అమలు చేసిన ట్రాఫిక్ ఆంక్షలతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏ మార్గం నుంచి వెళ్తున్నా పోలీసులు ఆపేయడంతో కార్యాలయాలకు, పలురకాల పనుల కోసం బయటకు వచ్చిన వారు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్‌ను మళ్లించడంతో వాహనదారులు ఇబ్బందులు చవిచూశారు. తీవ్ర ఆంక్షలు పెట్టడంతో నరసన్నపేట నుంచి రాకపోకలు సాగించేవారు తీవ్ర అవస్థలకు గురయ్యారు. రహదారులకు ఇరువైపులా ఇనుప రాడ్లతో బారికేడ్లను ఏర్పాటు చేయడంతో ఇళ్లకు వెళ్లడానికీ ఇబ్బందులు పడ్డారు. నరసన్నపేటలోకి బస్సులను అనుమతించకపోవడంతో వృద్ధులు, చంటి పిల్లలను ఎత్తుకుని మహిళలు రెండు కిలోమీటర్ల మేర నడిచారు. సిఎం ప్రసంగం సమయంలోనే కొందరు వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగి వారిని నెట్టుకుంటూ బయటకు వెళ్లిపోయారు. సభకు ఉపాధి కూలీలను సైతం తరలించారు. సిఎం ప్రయాణించే మార్గంలో దుకాణాలన్నింటినీ పోలీసులు మూయించారు.

భూ రక్ష కాదు.. భూ భక్ష

- భూములను కొల్లగొట్టేందుకే సర్వే
- సిఎం జిల్లా పర్యటనలతో ఒరిగింది శూన్యం
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

భూ సమగ్ర సర్వే పేరుతో తాతల కాలం నుంచి రైతులు సంపాదించుకున్న ఆస్తులను కొల్లగొట్టేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పథకం వేశారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. అది భూ రక్ష కాదని భూ భక్ష పథకమన్న భయం ప్రజల్లో నెలకొందన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడ భూములను కొల్లగొట్టవచ్చన్న అంచనాలను తయారు చేసుకునేందుకు సర్వే చేస్తున్నారని ఆరోపించారు. రూ.వెయ్యి కోట్ల ఖర్చుతో చేస్తున్న సర్వేలో ఎక్కడైనా భూముల సరిహద్దులను గుర్తించగలిగారా అని ప్రశ్నించారు. జగన్ ఫొటో ఉన్న పుస్తకాలు ప్రతి ఇంట్లో ఉండాలని, పొలం గట్టుపై ఆయన ఫొటో అతికించిన రాళ్లు ఉండాలన్న ఆలోచన తప్ప దీనివల్ల రైతులకు ఎంతమాత్రం ప్రయోజనం లేదన్నారు. రీ సర్వేతో ఇప్పటికే గ్రామాల్లో వివాదాలు మొదలయ్యాయని, ప్రజలు కొట్టుకుంటే అందులో ఆనందాన్ని వెతికేందుకే ఈ సర్వే చేస్తున్నారని చెప్పారు. సాగు హక్కుదారుని ఫొటో మాత్రమే పాసు పుస్తకంలో ఉండాలన్న కనీస ఆలోచన లేకుండా జగన్ ఫొటోను ముద్రించారని విమర్శించారు. భూ హక్కు కల్పించే అధికారం కేవలం సివిల్ కోర్టులకే ఉందని స్పష్టం చేశారు. సర్వే చేస్తున్నట్లు కనీసం ఫారం–18, 19 కూడా రైతులకు ముందుగా ఇవ్వడం లేదన్నారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నించి చట్టాన్ని మార్చలేమని భావించి వెనక్కి తగ్గిందన్నారు.

ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టాక జిల్లాకు నాలుగు సార్లు వచ్చి వెళ్లినా, జిల్లా ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ఒక్క పనీ చేయలేదని విమర్శించారు. సిఎం పర్యటనకు 24 గంటల ముందే నరసన్నపేట పట్టణాన్ని అష్టదిగ్బంధం చేశారని, అంత భయంతో ఎందుకు పర్యటించాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నారంటే నేరుగా సమస్యలు చెప్పుకునే అవకాశం ఉంటుందని ప్రజలు ఆశగా వస్తారని, వారిని ఇళ్ల నుంచి బయటకు రానీయకుండా అష్టదిగ్బంధం చేశారని దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిట్టకథలు చెప్పడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. టిడిపి ప్రభుత్వ హయంలో జిల్లాకు ఏం చేయలేదని చెప్పిన ధర్మాన 80శాతం ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు ఎవరు పూర్తి చేశారో చెప్పాలన్నారు. రిమ్స్ భవన నిర్మాణాలు ఎవరు చేపట్టారో ప్రజలకు తెలుసన్నారు. వంశధార రిజర్వాయర్‌ను 97 శాతం టిడిపి ప్రభుత్వం పూర్తి చేస్తే, మిగిలిన మూడు శాతం పనులు పూర్తి చేసి ఎందుకు సాగునీరందించలేకపోతున్నారని ప్రశ్నించారు. కోడి రామ్మూర్తి స్టేడియం పూర్తికి రూ.15 కోట్లు ఇస్తానని ప్రకటించిన సిఎం ఒక్క పైసా ఇవ్వలేదని విమర్శించారు. జిల్లా అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు ధర్మానకు లేదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, నాయకులు పి.ఎం.జె బాబు, జామి భీమశంకరరావు, మాదారపు వెంకటేష్, సింతు సుధాకర్, వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మరో అవకాశం

- 9వ తేదీ వరకు పట్టభద్రుల ఓటర్ల నమోదు
- డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్ల నమోదుకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 23వ తేదీ నుంచి డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు పట్టభద్రుల ఓటర్ల నమోదుకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. 2019 అక్టోబరు 31వ తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఫారం–18 దరఖాస్తుతో పాటు నివాస చిరునామా ఆధారంగా సంబంధిత ఆర్‌డిఒ, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు ceoandhra.nic.in వెబ్‌సైట్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 1950 ట్రోల్ ఫ్రీ నంబరును గానీ, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయాన్ని గానీ సంప్రదించాలని సూచించారు. గడువులోగా దరఖాస్తు చేసుకున్న ఓటర్లతో డిసెంబరు 30వ తేదీ తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల ముసాయిదా జాబితాను బుధవారం వెల్లడించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 57 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇప్పటివరకు 46,119 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారిలో 32,351 మంది పురుషులు, 13,764 మంది మహిళలు, నలుగురు ఇతరులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అరసవల్లికి వివిఐపిల తాకిడి

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన పలువురు ఉన్నతాధికారులు అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని బుధవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో అర్చకులు వారిని స్వాగతించారు. విజయవాడ చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, ట్రైనీ కలెక్టర్ అంబరీష్, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజినీర్ పి.సి రమేష్ కుమార్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి స్వామి వారి సేవల అనంతరం అనివెట్టి మండపంలో శేష వస్త్రాలను కప్పి స్వామి వారి జ్ఞాపికను ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

'చాగంటి'కి గురజాడ పురస్కారం సరికాదు

గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం

శ్రీకాకుళం అర్బన్: అభ్యుదయ సంఘ సంస్కర్త, ఆచరణాత్మక భౌతికవాది, నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు పేరుతో ఇచ్చే గౌరవ పురస్కారానికి సనాతన భావవాదం, ఆధ్యాత్మిక చింతనలతో మునిగి తేలే ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ఎంపిక చేయడం సరికాదని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు వి.జి.కె మూర్తి, ఎం.ప్రభాకరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయనగరంలోని గురజాడ సాంస్కృతిక సమాఖ్యకు గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం తరపున తమ అసమ్మతిని తెలియజేసినట్లు తెలిపారు. మహిళల హక్కులపై, స్త్రీ పురుష సమానత్వ భావనపై చాగంటి ప్రదర్శిస్తున్న తిరోగమన వైఖరిని ఖండించారు. మహిళలపై పెరుగుతున్న అత్యాచార ఘటనలు, అఘాయిత్యాలకు వారి వేషధారణే కారణమని సామాజిక సమస్యలపై ఆయనకున్న అసమగ్ర దృక్పథాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యతరగతి ప్రజల్లో ఆదరణ ఉన్న చాగంటి తన అభిప్రాయాన్ని మార్చుకుని వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని హితవు పలికారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎన్‌జిఒ నాయకుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతిష్టాత్మకంగా భావించే ఎన్‌జిఒ ఎన్నికలు వాతావరణం వేడెక్కింది. ప్రభుత్వ శాఖలవారీగా ఈ ఎన్నికలను తాలూకాల వారీగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 27న జిల్లా కేంద్రంతో పాటు డివిజన్ పరిధిలోని పలు తాలూకాలకు కొత్త కమిటీల ఎన్నిక నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం సంఘ జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించారు. అటవీ శాఖ, పశుసంవర్ధక శాఖ, తహాశీల్దార్, వ్యవసాయశాఖ, ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం, సహకారశాఖ కార్యాలయాలను సందర్శించారు. ఉద్యోగులతో నేరుగా మాట్లాడి ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్నికల ప్రాధాన్యతను ఉద్యోగులకు వివరించారు. ఈ సమావేశాల్లో సంఘం ప్రతినిధులు కె.జయరావు, రాయి వేణుగోపాలరావు, బొత్స శ్రీనివాసరావు, బడగల పూర్ణచంద్రరావు, రవీంద్రకుమార్, పి.శ్రావణి, ఐ.చిట్టిబాబు, మెట్ట భూపాలరావు, ఎస్.అప్పలకొండ పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనాలతో రామును ఊరేగిస్తున్న యువకులు

రాముకు ఘన స్వాగతం

ప్రజాశక్తి- పొందూరు

ఇటీవల నేపాల్‌లో నిర్వహించిన ఎస్‌బిఎఫ్‌కె-77వ ఇంటర్నేషనల్ ఆటలో మండలంలోని రాపాక కూడలిలోని సోనీ ఫిట్‌నెస్ జిమ్ నిర్వాహకులు దేగల రాము బంగారం, మూడు వెండి పతకాలను కైవసం చేసుకున్నాడు. ఈ నెల 16 నుంచి 19వరకూ నిర్వహించిన పోటీల్లో పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం, వంద మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ త్రోలో వెండి పతకాలను కైవసం చేసుకుని తన సత్తాను చాటాడు. రాము స్థానిక రాపాక కూడలిలో సోనీ ఫిట్‌నెస్ జిమ్‌ను నిర్వహిస్తూ యువతకు శిక్షణను ఇస్తున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో జిల్లా కీర్తిని ఇనుమడింప చేసిన రాముకు స్థానిక యువకులు ఘనంగా స్వాగతం పలికారు. నేపాల్ నుంచి తిరిగివచ్చిన ఈయనకు యువకులు డప్పుల వాయిద్యాలతో ద్విచక్రవాహనంపై గ్రామంలో ఊరేగించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించిన రాముకు స్థానికులు పలువురు అభినందనలు తెలిపారు.

26న పలాస మండల సమావేశం

పలాస: పలాస మండల కార్యాలయంలో ఈ నెల 26న పలాస ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సేవల్లో ఘనాపాటి 'మాతృమూర్తి'

ప్రజాశక్తి- కవిటి

సమాజానికి ఏదో చేయాలనే తపన, ఆర్తులను ఆదుకోవాలనే ఆతృత వారిని సమాజ సేవవైపు నడిపిస్తోంది. ఇంకొకరిని ఆర్థికంగా ఆదుకునే శక్తి తమకి లేకపోయినా సమిష్టిగా కృషిచేస్తే సాధించలేనిది ఏదీ లేదంటూ నిరూపిస్తున్నారు మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు. మండలంలోని కుసుంపురంలో 2010లో పది మంది యువకులు ప్రారంభించిన సామాజిక సేవా కార్యక్రమాలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా విస్తరించి ఆపద అంటే అండగా ఉంటూ... ఆకలి అంటే మాతృమూర్తిలా అమృతహస్తం పేరుతో నిత్యావరాలను అందిస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో మాతృమూర్తి సేవలు మెచ్చి కేవలం కవిటి మండలంలోనే కాకుండా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల నుంచి అనేకమంది సభ్యులు 'మాతృమూర్తి'లో చేరి తమ సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ..

కేవలం అభాగ్యులకు అండగా ఉండటమే కాకుండా ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిస్తూ, సామాజిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై వారిలో చైతన్యం కలిగిస్తున్నారు మాతృమూర్తి సభ్యులు. ముఖ్యంగా మరుగుదొడ్లు, స్వచ్ఛ భారత్, ఓటు హక్కు ఆవశ్యకత వంటి అంశాలపై గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు భరోసా ఇస్తూ..

ఉద్దానం ప్రాంతంలో బడుగుబలహీన వర్గాల్లో కిడ్నీ వ్యాధికి గురై అనేకమంది ఆపన్నాహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. అటువంటి వారికి ఓ 'మాతృమూర్తి'లా ఆదరిస్తున్నారు సభ్యులు. అంతేకాకుండా నిరుపేదలు, అభాగ్యులకు అన్నపూర్ణ అమృతహస్తం పేరిట నిత్యావసర సరుకులు అందజేస్తూ తనకు చేతనైన సాయం చేస్తోంది మాతృమూర్తి యువజన సంఘం. దీంతో ఆపద.. అంటే సరే పదా అంటూ మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు అందిస్తున్న ఆపన్నాహస్తం వేనోళ్లా కొనియడబడుతోంది.

రక్తదాతలుగా..

ఇటీవల కాలంలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న అనేక మంది రోగులకు రక్తదానం చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారు మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు. తరచూ రక్తదానంపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి యువతకు ప్రోత్సాహాన్ని ఇస్తుంటారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందిస్తూ కుసుంపురంలో రూ.75 వేలతో వినాయక విగ్రహం, రూ.20 వేలతో సరస్వతి దేవి విగ్రహం నిర్మించారు.


విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించిన సభ్యులు (ఫైల్)

అభాగ్యుల ఆకలి తీరుస్తున్నాం



పదిమందితో కుసుంపురం గ్రామంలో ప్రారంభమై నేడు ఇంతింతై వటుడింతై అన్నట్లు మా మాతృమూర్తి యువజన సంఘం సేవలు జిల్లా వ్యాప్తంగా అందిస్తున్న సేవలు ఎందరో అభాగ్యుల ఆకలి తీరుస్తోంది. ముఖ్యంగా కిడ్నీ బాధితులు, క్షతగాత్రులు, బడుగుబలహీన వర్గాలకు మాతమూర్తి నిరంతరాయంగా అందిస్తున్న సేవలు వారికి భరోసా కల్పిస్తోంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ మా సేవలు కొనసాగిస్తూ అభాగ్యులకు అండగా ఉంటాం

- బత్తిన గోపాలరావు, గౌరవ అధ్యక్షుడు

ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం చేపడుతున్న కక్షసాధింపు చర్యలు, మహిళలపై అత్యాచార ఘటనలు, దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని టిడిపి శ్రేణులు ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆమదాలవలస, శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జీలు, మండల పార్టీ అధ్యక్షుల శిక్షణా తరగతుల్లో బుధవారం పాల్గొని మాట్లాడారు. టిడిపికి గ్రామగ్రామాన పటిష్ట వంతమైన కేడర్ ఉందని, వారిలో సమయస్ఫూర్తిని నింపడం ద్వారా నూతన ఉత్తేజాన్ని తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో చెప్పాలన్నారు. ఈ శిక్షణా తరగతుల ద్వారా మరింత ప్రోత్సాహాన్ని పొందుతూ ముందడుగు వేయాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చిట్టి మోహన్, పి.ఎం.జె.బాబు, తోణంగి వెంకన్న యాదవ్, రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్, ఇప్పిలి తిరుమలరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

'భూ హక్కు - భూ రక్ష' బూటకం

ప్రజాశక్తి- ఆమదాలవలస


రమేష్

భూ హక్కు - భూ రక్ష పథకం బూటకమని టిడిపి జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. ఆయన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు బినామీ హక్కు దారులుగా వైసిపి పార్టీకి చెందిన సానుభూతిపరులను రికార్డుల్లో చూపించి ఆ తర్వాత వాటిని కబ్జా చేయడానికే ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. టిడిపి హయాంలో ఆర్‌ఒఆర్ యాక్టు ద్వారా భూహక్కులు సమర్థవంతంగా అమలయ్యేవని పేర్కొన్నారు. దుష్ట చతుష్టయంలో ఎ-1, ఎ-2లు తప్ప ఇతరులు ఎవరూ లేరన్న సంగతి ముఖ్యమంత్రి తెలుసుకోవాలని హితవుపలికారు. మూడున్నర ఏళ్ల వైకాపాలనలో విధ్వంసం, వినాశనం తప్ప జరిగిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. రైతుకు జీవనాడి అయిన వంశధార పేజ్-2, మహేంద్ర తనయా, ఆఫ్‌షోర్, నాగావళి ఆధునికీకరణ పనులు ఈ ప్రభుత్వ హయాంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయని ఎద్దేవా చేశారు.

ఎఐఐబి ప్రాజెక్టు పనులు పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో జరుగుతున్న ఎఐఐబి ప్రాజెక్టు స్థలం, పనులను ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్‌బ్యాంకు బృందం సభ్యులు పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజినీరు రాజారావు, కమిషనర్ రమేష్, డిప్యూటీ ఇంజినీరు సుధాకర్ బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ పృధ్వీ, కామేష్ పాల్గొన్నారు.


మునగ పంటను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్‌బాబు

మునగ సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మునగ సాగుతో అధిక దిగుబడులు సాధించి, ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని ఎన్‌ఆర్‌ఇజిఎస్ సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వి.సతీష్‌బాబు అన్నారు. బుధవారం ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో భాగంగా మండలంలోని రేగులపాడు గ్రామానికి చెందిన పల్లి ధర్మారావు సాగు చేస్తున్న మునగ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు విధానం, వాటి స్థితిగతులను రైతు ధర్మారావును అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఒకే పంటని వేయకుండా ఇటువంటి లాభదాయకమైన తోటలను పెంచుకొని అధిక దిగుబడులు సాధించి, లాభపడాలని కోరారు. ఇందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఆయన వెంట జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.శ్రీహరి. సుధాకర్. సాంకేతిక సహాయకులు ఎన్.గోపాలకష్ణ ఉన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు : మండలంలోని ధర్మపురంలో గురువారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించినట్లు వైసిపి మండల అధ్యక్షుడు పప్పుల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

బూర్జ : శాసనసభ స్పీకర్ సీతారాం మండలంలోని లక్కవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని ఎంపిడిఒ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ సేవలు

జి.సిగడాం : మండలంలోని పెంట గ్రామ సచివాలయం పరిధిలో ఆధార్ మెగా క్యాంపు 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నామని మండల ప్రభుత్వ ఆధార సర్వీసు ఆర్గనైజర్ రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ సంబంధిత సర్వీసులు ఇకెవైసి, కొత్తగా ఆధార్ పెట్టుకోవడం, ఆధార్‌కు ఫోన్ నంబరును జత చేయడం, డేట్ ఆఫ్ బర్త్ మార్చుకోవడం, వెలిముద్రలు పడకపోయినా, పేర్లలో ఏమైనా దోషాలు ఉన్నా ఈ రెండు రోజుల్లో మార్చుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలు తమ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కొండభీంపురం నుంచి సిఎం సభకు వెళ్తున్న బస్సు

ప్రయాణికుల పాట్లు

ప్రజాశక్తి- టెక్కలి

నరసన్నపేటలో సిఎం జగన్ సభకు జనాలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు వేశారు. దీంతో సుదూర ప్రాంతాలకు బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. టెక్కలి ఆర్టీసీ డిపో పరిధిలోని నాలుగు అల్ట్రా డీలక్స్, 12 ఎక్స్‌ప్రెస్, 12 సూపర్ లగ్జరీ, 21 పల్లె వెలుగు బస్సులు కలుపుకొని మొత్తం 39 బస్సులను మళ్లించారు. దీంతో టెక్కలి పట్టణానికి ఆనుకుని ఉన్న నౌపడా, పూండీ, తెంబూరు, విశాఖ, వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన సర్వీస్‌లను తగ్గించారు. బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



రామారావుకు నగదును అందిస్తున్న కృష్ణంరాజు

ట్రూ హ్యాండ్స్ చేయూత

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని గొల్లకంచిలి గ్రామానికి చెందిన కె.రామారావు కుటుంబానికి ట్రూ హాండ్స్ సంస్థ ప్రతినిధులు బుధవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కూతుర్లను పోషించుకుంటున్న రామారావు బ్రెయిన్ ట్యూమర్‌కి గురయ్యాడు. చికిత్స కోసం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు విషయం తెలియడంతో ఆ సంస్థ ప్రతినిధులు చేయూత అందించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నర్తు కృష్ణంరాజు, సభ్యులు కలిసి రూ.10వేలు సాయం అందించారు.

ఆ కండక్టర్లకు సెలవు

టెక్కలి: సిఎం జగన్మోహన్‌రెడ్డి సభకు వేసిన ఆర్టీసీ బస్సుల్లో డ్రైవర్లకు విధులు కేటాయించి, కండక్టర్లకు సెలవులు ఇచ్చారు. దీనిపై విమర్శలు వస్తున్నాయి. ఆర్టీసీ కండక్టర్లపై వివక్ష చూపడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్నప్పుడు ఇటువంటి వివక్ష ఎన్నడూ చూడలేదని పలువురు కండక్టర్లు చెప్తున్నారు. సిఎం సభకు వేసిన ఆర్టీసీ బస్సులో ఒక్క డ్రైవర్‌కి డ్యూటీ ధ్రువపత్రం ఇచ్చి, కండక్టరుకు సెలవు రాస్తూ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. ఇకనైనా ఇటువంటి చర్యలు మానకోని, కండక్టర్లకూ విధులు కేటాయించాలని కోరుతున్నారు.

ఇళ్ల పేరుతో పేదల భూములు ఆక్రమిస్తారా?

పలాస: జగనన్న ఇళ్ల కాలనీ పేరుతో నిరుపేదల భూములను ఆక్రమిస్తారా అంటూ జనసేన నాయకులు దుర్గారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బ్రాహ్మణతర్ల గ్రామంలో మణిగాం యశోద, షేక్ చాంద్, బాధిత కుటుంబాలతో ఆయన మాట్లాడారు. డి పట్టా భూములను వైసిపి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన రెవెన్యూ అధికారులు బలవంతంగా తీసుకొని వారికి తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డి పట్టా భూములు బలవంతంగా స్వాధీనం చేసుకోవడం అన్యాయమని, బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి జనసేన అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. బ్రాహ్మణతర్లా రెవెన్యూ పరిధిలో జగనన్న కాలనీ కోసం బలవంతంగా సేకరించిన సర్వే నెంబర్ 124లో సుమారు 1.50 ఎకరాల భూమిని తిరిగి పక్షవాతం బారినపడిన షేక్ చాంద్, మణిగాం యశోదలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 2013 భూసేకరణ చట్టం ప్రకారం బాధితులకు ఎంత భూమి సేకరించారో అంత భూమి మరొకచోట చూపించాలన్నారు. అదీ కాకుంటే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు అలా చేయని పక్షంలో తహాశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

'గరికపాటి'ని అరెస్టు చేయాలి

పలాస: తన ప్రవచనాలలో అడుగడుగునా మహిళలను అవమాన పరుస్తూ వారి వేష, భాషలను హేళన చేస్తున్న ప్రవచనకర్త గరికపాటి నరసింహారావును అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ డిమాండ్ చేశారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. గరికపాటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్త్రీ, పురుష సమానత్వాన్ని బోధించాల్సిన గరికపాటి మహిళల వేషధారణ వల్లే అత్యాచారాలు జరుగుతున్నాయని, అత్యాచారాలకు, లైంగిక వేధింపులకు మహిళలే కారణమని చెప్పటం దారుణమన్నారు. పురుషాధిక్య, మనువాద భావజాలాన్ని నరనరాన జీర్ణించుకున్న గరికపాటిని సమాజం నుండి వెలివేయాలని పిలుపునిచ్చారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలొచ్చినా మహిళలపై అకత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రభుత్వాలు మహిళ హక్కులను కాపాడటంలో విఫలమవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ పురుష సమానత్వం సాధించటం ద్వారాన చైతన్యవంతమైన సమాజం ఆవిర్భవిస్తుందన్నారు. ప్రభుత్వం ఇకనైనా గరికపాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఈశ్వరమ్మ, సహాయ కార్యదర్శి హేమయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుగుణ


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దమడి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో పెద్దమడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 20, 21 తేదీల్లో విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలు నిర్వహించారు. ఖోఖోలో ఎస్.శిరీష(9వ తరగతి), కబడ్డీలో ఎ.అమృత వర్షిణి (10వ తరగతి), వ్యాసరచన పోటీలో ఎస్.నందిని(9వ తరగతి) ప్రతిభ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల హెచ్‌ఎం ఎల్.ముకుందరావు, పిఇటి ఎం.ప్రతిమ, పీడీ జె.సుధారాణి, డిప్యూటీ వార్డెన్ ఎ.జానకి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.


శిక్షణలో పాల్గొన్న గిరిజన మహిళలు

గిరిజన మహిళలకు శిక్షణ

కొత్తూరు: మండలంలోని గిరిజన మహిళలకు బుధవారం స్థానిక వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో ఆదివాసీ హక్కులు, మహిళల దృక్పథంపై వెలుగు కార్యదర్శి బి.సంజీవరావు శిక్షణ ఇచ్చారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల సాధన దిశగా, హక్కులు పొందేందుకు అవగాహన కల్పించారు. మహిళ చట్టాల, గృహహింస, మద్యపాన నిషేధం చట్టం, వరకట్న నిషేధ చట్టం, బాల్య వివాహ చట్టం, విద్యాహక్కు చట్టాలపై వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన, భేటి బచావో, భేటి పడవో పథకాలను వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు కె.దాస్‌నాయుడు, వెన్నెల పాల్గొన్నారు.

సేవలతోనే మంచి గుర్తింపు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఏ ఉద్యోగికైనా చేసిన సేవలతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని విశ్రాంత డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కొత్తకోట లీలారాణి అన్నారు. వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జోగి గౌతమ్ పీజీ(అనస్థీషియా)కి ఎంపిక కావడంతో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర సర్వీసుల్లో సేవలు అందించడం సవాల్‌తో కూడుకున్నదని అన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఉత్తమ సేవలు అందించారని తెలిపారు. డాక్టర్ గౌతమ్‌తో పాటు పిహెచ్‌సి నుంచి బదిలీపై వెళ్లిన పి.కృష్ణవేణి, సరస్వతి, ప్రసాద్, మాధవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అంజలి, ప్రశాంత్ దివ్య, డాక్టర్ సునీల్, పవన్, శ్యాం ప్రసాదరెడ్డి, బోనెల గోపాల్, లక్ష్మీనారాయణ, అనురాధ, కళ్యాణి, వెంకటాపురం పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లీలారాణి


మాట్లాడుతున్న వరప్రసాదరావు

శిక్షణలు వినియోగించుకోవాలి

బూర్జ : పొందూరు చేనేత చీరలపై ట్రైబల్ బ్లాక్ ప్రింటింగ్‌పై ఇస్తున్న శిక్షణలు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డిడిఎం కుప్పిలి వరప్రసాదరావు అన్నారు. మండలంలోని పెద్దపేటలో ఉన్న ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో మహిళలకు చేనేత చీరలపై ట్రైబల్ బ్లాక్ ప్రింటింగ్‌పై ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణ తీసుకోవడం వల్ల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌లో 90 మందికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ 15 రోజుల పాటు ఇస్తామని పేర్కొన్నారు. నాబార్డు నిధుల నుంచి ఈ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను కలిసిన నాయకులు


ఇచ్ఛాపురం : సెల్ఫీ తీసుకుంటున్న రాజ్యలక్ష్మి

పలాస: నరసన్నపేటలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష (రీ సర్వే) పత్రాల పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం జగన్‌ను పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఆయనతో పాటు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు.

ఇచ్ఛాపురం: సిఎం జగన్‌తో ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి సెల్ఫీ దిగారు. జగన్ ఎంత బిజీగా ఉన్నా ఆమె కోరిక మేరకు ఫొటోకు అంగీకరించారు.

సువర్ణ...

ఆమదాలవలస : జిల్లాలోని నరసన్నపేట నియోజకవర్గం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జగన్‌తో సెల్‌ఫోన్‌తో సెల్ఫీ దిగారు. ఈమెతో పాటు వైసిపి నాయకులు సువ్వారి సత్యనారాయణ ఉన్నారు.

నీలకంఠంనాయుడు...

జి.సిగడాం : నరసన్నపేటలో రెండో భూమి రీ సర్వే ప్రారంభానికి విచ్చేసిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు హెలీపాడ్ వద్ద ఆత్మీయ స్వాగతం పలికారు. ఇందులో భాగంగా పుష్పగచ్ఛం అందజేశారు.

డయాలసిస్‌కు బెడ్లు పెంచాలని వినతి

కవిటి: మండలంలో కిడ్నీ డయాలసిస్ సెంటరులో బెడ్లు చాలడం లేదని, అవసరమైన మేర పెంచాలని సిఎం జగన్‌ను ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ కోరారు. మండలంలో పలు సమస్యలు కోరుతూ సిఎంకు ఆయన వినతిపత్రం అందించారు. దీనిపై సానుకూలంగా సిఎం స్పందించారు.

దళితవాడలను ప్రత్యేక పంచాయతీలు చేయాలి

శ్రీకాకుళం అర్బన్ : దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలను చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని అంబేద్కర్స్ ఇండియా మిషన్ సైనిక్ విభాగం రాష్ట్ర కన్వీనర్ తైక్వాండో శ్రీను కోరారు. నరసన్నపేటలో సిఎం జగన్ పర్యటనకి విచ్చేసిన సందర్భంగా ఆయనను కలిసి దళితుల సమస్యలను వివరిస్తూ... వినతిపత్రం అందజేశారు. భూమి లేని దళితులకు భూములు కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. ఎన్ఎస్ఎఫ్ డీఎస్, ఎన్ఎస్‌కెఎఫ్ డిఎస్ వంటి పథకాలు అమలు చేయాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యూనిట్ల ఏర్పాటుకు రాయితీలతో కూడిన రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు దళిత వాడలు, గిరిజన వాడల్లో ఖర్చు చేసేలా చూడాలని కోరారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలని విన్నవించారు. దళితులకు, గిరిజనులకు పదవుల్లో రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా ఆర్థికంగా, సామాజికంగా ఆదుకోవాలని కోరారు.


ఆమదాలవలస : సిఎంతో సెల్ఫీ తీసుకుంటున్న సువర్ణ

ప్రెస్ అకాడమీకి సంక్షేమ నిధిని కేటాయించాలి

నరసన్నపేట: ప్రెస్ అకాడమీని బలోపేతం చేసి,పాత్రికేయుల సంక్షేమానికి ప్రత్యేక నిధి కేటాయించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని శ్రీకాకుళం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. సోషల్ మీడియాతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని,వాటి నియంత్రణకై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పెండింగులో ఉన్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలను తక్షణమే పునరుద్ధరణ చేయాలని, సొసైటీలతో సంబంధం లేకుండా అర్హులైన మీడియా ప్రతినిధులకు తహసీల్దార్ స్థాయిలో ఇల్లు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఒక పథకం ప్రకారం రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని,వీటిని నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.. సిఎం ను కలిసిన వారిలో శ్రీకాకుళం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా హౌసింగ్ కమిటీ అధ్యక్షుడు అల్లు యుగంధర్,విశాఖపట్నం సాక్షి టివి ప్రతినిధులు నాయుడు, శంకర్ ఉన్నారు.


జి.సిగడాం : పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలకంఠంనాయుడు


కవిటి : వినతిపత్రం అందజేస్తున్న కడియాల ప్రకాష్


శ్రీకాకుళం అర్బన్ : వినతిపత్రం అందజేస్తున్న శ్రీను


పలాస : సిఎం జగన్‌తో మాట్లాడుతున్న గిరిబాబు


నరసన్నపేట : సిఎంను కలిసిన మీడియా ప్రతినిధులు

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఆమదాలవలస : సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి దార్శనికతతో రూపుదిద్దుకున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో గడపగడపలో సంక్షేమ నిబద్ధత స్పష్టంగా తెలుస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 14వ వార్డు ఐ.జె.నాయుడు కాలనీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల జీవితాల్లో అత్మగౌరవం పెంపొందింపజేసే దిశగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మహిళా సాధికారతలో భాగంగా అన్ని సంక్షేమ పథకాల్లో అగ్ర తాంబూలం మహిళలకే కేటాయించి ఆడపడుచుల తోబుట్టువు అయ్యారని తెలిపారు. యావత్ భారతావని దృష్టి సారించేలా పాలనలో విప్లవాత్మక నిర్ణయాలతో ముందుకు కొనసాగుతున్నారన్నారు.

విద్య, వైద్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో కమిషనరు ఎం.రవిసుధాకర్, ఎఇ కె.అప్పలనాయుడు, వైసిపి నాయకులు బి.వి.రమణమూర్తి, పద్మావతి, కనకరాజు, ఎం.జోగారావు, ఎ.ఉమామేశ్వరరావు, బి.అజంతాకుమారి, దుంపల శ్యామలరావు, చిరంజీవి పాల్గొన్నారు.

లావేరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బురాడ చిన్నారావు, లంకలపల్లి గోపి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు షేక్‌ఖాన్ బాష, వైస్ ఎంపిపి లుకలాపు శ్రీనివాసరావు, ఎపిఎం మాఊరు మాధవీలత, ముప్పడి శ్రీరాములు, సెక్రటరీ రాంబాబు పాల్గొన్నారు.



లావేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

బాలల భవిష్యత్‌కు బాటలు వేద్దాం



ఆమదాలవలస : మాట్లాడుతున్న ఎంఇఒ రామారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మనబడి నాడు-నేడు కార్యక్రమంతో పాటు మన పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలన్నింటినీ సద్వినియోగం చేసుకొని బాల బాలికల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంఇఒ దుప్పల రామారావు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు పేడాడ వెంకట రవణమ్మ అధ్యక్షతన బుధవారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక పథకాలను వివరించాలన్నారు. పిల్లలకు అందించిన యూనిఫామ్, బెల్టు, బూట్లు తప్పనిసరిగా పిల్లలందరూ ఉపయోగించేటట్లు చూడాలని సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్లలో అందించిన పాఠ్య, నోట్ పుస్తకాలు వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారురు. ప్రతి తరగతిలోనూ చదువులో వెనుక పడుతున్న పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి బోధన చేయాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులలో స్థల సమస్య వల్ల కొంతమేరకు ఇబ్బంది ఉన్నా, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పిల్లల భవిష్యత్ కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆదనపు విద్యాశాఖ అధికారి పైడి కూర్మారావు, పాఠశాల క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

విద్యా బోధనలో నైపుణ్యాలను సాధించాలి

పొందూరు : విద్యా బోధనలో విద్యాసాతి వాలంటీర్లు నైపుణ్యాలను సాధించాలని ఎంఇఒ పి.వి.రామరాజు అన్నారు. స్థానిక రెండో నంబరు ప్రాథమిక పాఠశాలలో బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యాన ఇండియా లిటరసీ ప్రాజెక్టు స్కూల్ రెడీనెస్, బాలవికాస్ కార్యక్రమంలో భాగంగా పొందూరు, జి.సిగడాం మండలాలకు చెందిన విద్యాసాతి వాలంటీర్లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృత్యాధార బోధన ద్వారా శిక్షణ పొంది వాలంటీర్లుగా పనిచేయడం గొప్ప విషయమన్నారు. పాఠశాల విద్య పర్యవేక్షకులు గురుగుబెల్లి శ్యామలరావు, సంస్థ ట్రెజరీ జి.అప్పలనాయుడు, కో-ఆర్డినేటర్ టంకాల కరుణాకర రావు, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.మాధవి, ఎస్.నాయుడు, కమ్యూనిటీ ఆర్గనైజర్ జి.హేమసుందర్ పాల్గొన్నారు.



పొందూరు : మాట్లాడుతున్న ఎంఇఒ రామరాజు

కవిటి : టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ శిక్షణలో నేర్చుకున్న అంశాలు పాఠశాల స్థాయిలో అమలు చేసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి ఆకాంక్షించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరుగుతున్న టీచింగ్ ఎట్ రైట్ లెవల్ ఉపాధ్యాయ శిక్షణలో ఎంఇఒ పాల్గొన్నారు. టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ ప్రారంభ పరీక్షకు అనుగుణంగా విద్యార్థుల స్థాయిని గుర్తించి, అందుకు అనుగుణంగా తెలుగు, గణితం బోధించాలని సూచించారు. డిఆర్‌పిలు జుదిష్టి రోలో, జగదీశ్వరరావు, తులసి దాస్, సరస్వతి పాల్గొన్నారు.

నీలి కవాతు పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి రూరల్ : భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించిన సందర్భంగా ఈ నెల 26న విజయనగరం జిల్లా చీపురుపల్లిలో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యాన నిర్వహించే బహిరంగసభ, నీలికవాతు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమతా సైనికల్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా రామారావు మాట్లాడుతూ ఈ కవాతు, సభకు ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. వసంత రాజారావు, అలికాన మహేష్‌కుమార్, వన్నల లక్ష్మీనారాయణ, గొల్లపల్లి నందీశ్వరరావు, గౌరినాయుడు, ఇల్లకుల సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నందిగాం: మండలంలోని దిమ్మిడిజోల రామాలయ ప్రాంగణంలో కార్తీక మాసం ముగింపు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. తొలుత హరే రామ హరే కృష్ణ భజన బృందం అఖండ నామ సంకీర్తన నిర్వహించింది. నిర్విష్య ఆనందస్వామి, రామానంద స్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు అలరించాయి.



అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

గెడ్డకంచరాంలో పారిశుధ్య పనులు



కాలువను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జి.సిగడాం : మండలంలోని గెడ్డకంచరాంలో సర్పంచ్ పెంచిరెడ్డి లలిత కుమారి అధ్యక్షతన బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువలను శుభ్రం చేసి అందులో ఉండే పూడికను తీయిస్తున్నారు. ప్రజలను దోమలు బెడద నుంచి, అనారోగ్య బాధలు నుంచి కాపాడి గ్రామమంతా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పంచిరెడ్డి శ్యామలరావు, మారుపల్లి రాము, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల ధర్నా

పర్లాకిమిడి: అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని ఆ సంఘం అధ్యక్షులు వినిత సాహు, కార్యదర్శి పుణ్యవతి నాగవంశీల ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గజపతి జిల్లా కాశీనగర్ సిడిపిఒ కార్యాలయం ఎదుట భారతీయ మజ్దూర్ సంఘ్‌కు అనుబంధంగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం ధర్నా చేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ, అంతకంటే ఎక్కువ విద్యార్హతలు కలిగి ఉన్న అంగన్వాడీ కార్యకర్తలకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఒక్కో విద్యార్థికి ఆహారం కోసం చెల్లిస్తున్న రూ.7.45 పైసలను ప్రస్తుతం ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్లకు సరఫరా చేస్తున్న బియ్యం బస్తాలు కచ్చితమైన బరువు కలిగి ఉండేలా చూడాలన్నారు. లొకేషన్ ట్రాకింగ్ పద్ధతిని ఆపాలని, సిగ్నల్ లోపం కారణంగా అది సాధ్యపడదని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

నేడు వాలంటీర్ల భర్తీకి ఇంటర్వ్యూలు

ఇచ్ఛాపురం: మండలంలో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ల పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రామారావు తెలిపారు. పంచాయతీల్లో 17 వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరామని, ఉదయం 10.30గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. హాజరయ్యే అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

కంచిలి: మండలంలోని వివిధ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 11 మంది వాలంటీరు పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 11 పోస్టులకు ఆన్‌లైన్‌లో 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఆరులైన వారికి నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10.30గంటలకు మండల పరిషత్ కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

30న జోగారావు శత జయంతి

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామివారి దేవస్థానంలో పూర్వ అర్చకులు, వంశపారంపర్య ధర్మకర్త ఇప్పిలి జోగారావు శతజయంతి వేడుకలు ఈ నెల 30న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారులు ఇప్పిలి శంకరశర్మ, ఇప్పిలి జోగి సన్యాసిరావులు తెలిపారు. అరసవల్లిలోని వారి స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అరసవల్లి ప్రాశస్త్యాన్ని నలుదిశలా చాటిచెప్పేలా తమ తండ్రి ఇప్పిలి జోగారావు విశేష కృషి చేశారన్నారు. రాజకీయ వేత్తలు, ప్రఖ్యాత కళాకారులు బిస్మిల్లాఖాన్, మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి వారితో ఆయనకున్న సాన్నిహిత్యం ఆలయ అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటైందన్నారు. సంగీతంలో ప్రావీణ్యత ఉన్న జోగారావు కళాభిమానిగా కళాకారులను ప్రోత్సహించారన్నారు. జోగారావు సంస్మరణార్థం శతజయంతి వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో కుటుంబ సభ్యుల తోడ్పాటుతో శ్రీసుమిత్రా కళా సమితి ఆధ్వర్యాన ఈ వేడుకులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పఖ్యాత నాధస్వర, వేణువు, డోలు, వయోలిన్, మృదంగం కళాకారుల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. శ్రీసుమిత్రా కళాసమితి ప్రధాన కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, కిల్లాల ఫాల్గుణరావు, డి.పార్థసారధి, ప్రధాన విజయరాం పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో అధికారులు

నీటిని పొదుపుగా వాడుకోవాలి

పలాస: నీటిని పొదుపుగా వాడుకోవాలని, భూగర్భ జలాలు అడుగంటకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బ్రాహ్మణతర్ల ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి రవికుమార్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల పంచాయతీ కార్యాలయంలో జల జీవన్ మిషన్ ప్రాజెక్ట్ టీమ్ లీడర్ ఐ.నిరంజన్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలన్నారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు. జల జీవన్ మిషన్ ప్రాజెక్ట్ అధికారులు శివకుమార్, మురళి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఇచ్ఛాపురం : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి, డిసెంబరు 21 నాటికి పూర్తి చేయాలని స్పెషల్ అర్బన హౌసింగ్ అధికారి సిహెచ్ మల్లేశ్వరరావు లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు సమీపిస్తున్న తరుణంలో నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్లు, కాలువలు, తాగునీరు, వీధి దీపాలు వంటి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇళ్లులేని పేదలు వచ్చిన ఈ సదావకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. నిర్మాణాల్లో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తక్షణమే అధికారులకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటారని అన్నారు.

సిఎం పర్యటన దృశ్యమాలిక



సిఎం జగన్ రాక కోసం వేచి చూస్తున్న ప్రజలు











మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, శ్రీకేష్ లాఠకర్



సిఎం జగన్‌ను చూసేందుకు వచ్చిన ప్రజలు





వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జగన్, పద్మప్రియ, కృష్ణదాస్



ప్రభుత్వ పథకాలను వివరిస్తూ నృత్యం చేస్తున్న చిన్నారులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఎం



రైతులతో సిఎం జగన్, ధర్మాన కృష్ణదాస్









అసైన్డ్ భూములు ఇవ్వాలని కోరుతూ..



ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు



సభా వేదికపై సిఎం, ప్రజాప్రతినిధులు, అధికారులు



జమ్ము కూడలి వద్ద నిలిచిన ట్రాఫిక్